క్లుప్తంగా

5కే రన్‌లో యశోదకృష్ణకు ప్రథమస్థానం


తణుకులో 5కే రన్ పోటీలో పాల్గొన్న గణపవరం విద్యార్థులు

గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఆదివారం నిర్వహించిన 5కే రన్ పరుగు పందె పోటీలో గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన యశోదకృష్ణ పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు పీడీ పద్మావతి తెలిపారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా వీరిలో యశోదకృష్ణ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. విజేతను హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం


భీమడోలులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

భీమడోలు: భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఉపాలయం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు శనివారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి కాళ్లకూరి ఉమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారిని విశేషంగా అలకరించి ముస్తాబు చేసారు. పూజారులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. గుండుగొలనులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రెండో రోజు ఆదివారం రాహుకేతువుల పూజ, హోమం నిర్వహించారు.

వైభవంగా షష్ఠి తిరునాళ్ల


కైకరం షష్ఠి తిరునాళ్ల దృశ్యాలు

ఉంగుటూరు: కైకరం సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు ఆదివారం వేలాది మంది భక్తులు షష్ఠి తిరునాళ్లలో పాల్గొన్నారు. భక్తులు నాగమ్మ తల్లిని దర్శించుకుని తిరునాళ్లలో పాల్గొన్నారు. ఏలూరు జిల్లాలోని వివిధ పలు గ్రామాల నుంచి ప్రజలు ఆలయానికి వచ్చి పూజలు చేశారు.

గడ్డి వాము దహనం

దెందులూరు: చల్లచింతలపూడిలో గుర్తు తెలియని వ్యక్తులు సుంకవల్లి రవికి సంబంధించి గడ్డివాముకు నిప్పు పెట్టారని ఎస్సై ఆర్. శివాజీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సుంకవల్లి రవికి చెందిన 5 ఎకరాలకు సంబంధించిన గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని దీనిపై రైతు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోళ్ల వ్యర్థాల రవాణాపై కేసు

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన జల్లూరి సుబ్బరాజు అనే వ్యక్తి తన సొంత వ్యాన్‌లో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో సేకరించిన 1.5 టన్నుల కోళ్ల వ్యర్థాలను తోకలపల్లిలోని తన ఆక్వా చెర్వులకు మేతగా వేసుకునేందుకు తీసుకువెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

రైతులకు హమాలీ చార్జీలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం రైతులకు హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రూ.3 కోట్లకు పైగా హమాలీ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం సొమ్ములు 48 గంటల్లో చెల్లిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం హమాలీ చార్జీలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. హమాలీ, రవాణా చార్జీలు రైతులకు సక్రమంగా అందించడం లేదని అన్నారు. 80 శాతానికి పైగా ధాన్యం ఉత్పత్తి చేస్తున్న కౌలు రైతులపైనే హమాలీ, రవాణా చార్జీలు భారం పడుతోందని చెప్పారు. ఈ క్రాప్‌లో భూ యజమాని పేరు ఉండటం వల్ల వారి పేరుతో ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రవాణా, హమాలీ చార్జీలు భూ యజమానుల బ్యాంక్ అకౌంట్లలో ఆలస్యంగా జమ చేయడం వల్ల కౌలు రైతులకు చేరడం లేదన్నారు. హమాలీ చార్జీలు వెంటనే రైతులకు ఖాతాలకు జమ చేయాలని కోరారు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

- సార్వా సాగులో కౌలు రైతు కుదేలు
- ఎకరాకు పది వేలపైనే నష్టం
- దాళ్వాపైనే అన్నదాతల ఆశలు

గణపవరం: ఈ సార్వా పంట కౌలు రైతులను నిలువునా ముంచేసింది. ఎక్కడో అదృష్టవంతులు కొందరు మాత్రం పెట్టుబడి దక్కించుకోగా చాలా మంది కౌలు రైతులు ఎకరాకు పదివేల రూపాయల వరకూ నష్టపోయారు. ఇక సొంత పొలం కలిగిన రైతులకు కూడా ఈ సార్వా పంట కలిసి రాలేదు. చావుతప్పి కన్నులొట్టబోయిన చందాన సొంతంగా సాగుచేసిన రైతులు పెట్టుబడులు మాత్రం దక్కించుకోగలిగారు. ప్రస్తుత సార్వా పంట ఆరంభంలోనే అధిక వర్షాలు, వరదలు రైతులను కుంగదీశాయి. నారుమడుల దశలో, నాట్లువేసిన తర్వాత కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులు రెండు సార్లు నారుమడులు, రెండు సార్లు వరినాట్లు వేయాల్సి వచ్చింది. దీనితో రైతులకు అదనంగా మరో పదివేల రూపాయల వరకూ పెట్టుబడి పెరిగింది. నాట్లు వేసిన తర్వాత భారీ వర్షాలు వరదలు రావడంతో నాట్లు మొత్తం కుళ్లిపోవడంతో రైతులు రెండోసారి నారుమడులు వేశారు. ఎకరాకు 30 కిలోల విత్తనాలకు రూ.1,500 వంతున రెండు సార్లు కలిపి రూ.3 వేలు ఖర్చయ్యింది.

ఇతర ప్రాంతాల్లో నారు కొనుగోలు

కొందరు రైతులు వరి నారును ఇతర జిల్లాలకు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకుని రెండోసారి నాట్లు వేశారు. అయితే ఇక్కడి రైతుల అవసరాలను గమనించిన అక్కడి రైతులు నారు ధర విపరీతంగా పెంచివేశారు. గతంలో ఉచితంగాను, నామమాత్ర ధరకూ ఇచ్చిన నారును ఇప్పుడు ఎకరాకు నాలుగు నుంచి ఐదు వేల రూపాయల చొప్పున విక్రయించారు. దీనికి కూలి ఖర్చులు, రవాణా ఖర్చులు మరో రెండువేలు వరకూ అయ్యాయి. రెండోసారి నాట్లు వేయడానికి ఎకరాకు మరో మూడు వేల రూపాయలు ఖర్చయ్యింది. ఇన్ని కష్టాలు పడినా సార్వాలో రైతులకు శ్రమకు తగిన ఫలితం దక్కలేదు సరికదా చేతి చమురు మాత్రం వదిలించింది.


ధాన్యం పట్టుబడి చేస్తున్న కౌలు రైతు, కూలీలు


ధాన్యం ఆరబోసిన కౌలు రైతు

సార్వాకు పెట్టుబడి వివరాలు (ఒక ఎకరాకు)

నారుమడి తయారీ	రూ.1,000
30 కిలోల విత్తనాలు	రూ.1500
రెండోసారి నారుమడికి	రూ.1500
పొలం దమ్ముచేయడానికి	రూ.5,000
నాట్లు వేయడానికి	రూ.3,000
రెండోసారి నాట్లు వేయడానికి	రూ.3,000
కలుపు తీయడానికి	రూ.2,000
ఎలుకల నివారణకు	రూ.2,000
పురుగుమందులకు	రూ.5,000
ఎరువులకు(3బస్తాలు)	రూ.4,000
వరికోతకు	రూ.5,000
ధాన్యం ఎండబెట్టడానికి	రూ.1,500
ధాన్యం పట్టుబడి, ఎగుమతికి (బస్తాకు రూ.14 చొప్పున)	రూ.500
మొత్తం పెట్టుబడి	రూ.35,000

దూర ప్రాంతంలో భూములు ఉన్నవారికి ధాన్యం బయటకు తేవడానికి మరో రూ. 2 నుంచి రూ.3 వేలు అదనంగా ఖర్చు అయింది.

ఎకరం పొలంలో వచ్చిన దిగుబడి	30 బస్తాలు
భూ యజమానికి కౌలు చెల్లింపు	15 బస్తాలు
కౌలు రైతులకు మిగిలింది	15 బస్తాలు
15 బస్తాలకు వచ్చిన సొమ్ము	రూ. 25,920

నియోజకవర్గంలో సార్వా సాగు వివరాలు

మండలం	ఎకరాలు
ఉంగుటూరు	23,712
భీమడోలు	12,964
గణపవరం	11,670
నిడమర్రు	3,608

ఆరుగాలం పడిన శ్రమంతా వృథా

ప్రస్తుతం మాసూళ్లు చేసిన రైతులకు కొట్టుపొట్టు ధాన్యం ఎకరాకు 35 బస్తాల దిగుబడి రాగా, పూర్తి ఆరుదల ధాన్యం ఎకరాకు 30 బస్తాల వరకు మాత్రమే రావడంతో దిగుబడి చూసిన రైతులకు నోటమాట రావడంలేదు. దీనిలో 15 బస్తాలు కౌలు పోను, మిగిలిన 15 బస్తాలకు, ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం బస్తా రూ.1,728 చొప్పున రూ.26 వేలు వస్తుంది. అయితే పెట్టుబడి మాత్రం ఎకరాకు రూ.35 వేలవరకూ కావడంతో కౌలు రైతులకు ఎకరాకు సుమారు రూ.10వేల వరకూ నష్టం కనిపిస్తోంది. దీనితో కౌలు రైతుల కళ్ల బైర్లు కమ్ముతున్నాయి. కొందరు కౌలు రైతులకు మాత్రం ఎకరాకు 35 బస్తాల దిగుబడి రావడంతో వారు మాత్రం బతుకు జీవుడా అంటూ పెట్టుబడితో బయటపడ్డారు. 15 బస్తాల మక్తా పోను మిగిలిన 20 బస్తాలకు రూ.34 వేల వరకూ రావడంతో వీరికి మాత్రం పెట్టుబడి దక్కి, ఆరుగాలం పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

కౌలు రైతులు నష్టాల బాట

చాలామంది కౌలు రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు బస్తాకు రెండు నుంచి మూడు వందల తక్కుకు అమ్ముకున్నారు. వీరికి నష్టం తప్పలేదు. మొత్తం మీద ఈ సార్వా పంట కౌలు రైతులను నష్టాల బాట నడిపించింది. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 52 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుండగా దీనితో 80 శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. వీరంతా ప్రస్తుత సార్వా పంటలో నష్టాలను చవిచూశారు. వచ్చే దాళ్వా పంట అయినా తమను ఆదుకోకపోతుందా అన్న ఆశతో దాళ్వా వైపు అడుగులు వేస్తున్నారు.

మూడెకరాలకు రూ.30వేలు నష్టం



నేను మూడు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు పదివేల రూపాయాల చొప్పున రూ.30 వేలు నష్టం వచ్చింది. సాగు ఆరంభం నుంచి ఒడిదొడుకులతోనే నడిచింది. రెండుసార్లు నాట్లు వేయడం వల్ల పెట్టుబడి పెరిగింది. బయటి నుంచి తెచ్చిన నారు సరిగా ఈనికలేక దిగుబడి ఎకరాకు 28 బస్తాలు వచ్చింది. తుఫాన్ కారణంగా కురిసిన వర్షంవల్ల చేను బురదగా మారి వరి కోత యంత్రంతో కోతకు రెట్టింపు ఖర్చయింది.

– సంకు వెంకటేశ్వరరావు, కౌలు రైతు

సొంతంగా సాగుచేసినా ఫలితం లేదు



నా సొంత పొలం నాలుగెకరాలు నేనే సాగు చేస్తున్నాను. ప్రస్తుత సార్వాలో వచ్చినంత ఇబ్బంది ఇంతకుముందెప్పుడూ చూడలేదు. రెండు సార్లు నాట్లు వేయడం వల్ల పెట్టుబడి పెరిగింది. దీనికి తోడు పొరుగు జిల్లా నుంచి నారు అధిక ధరకు తెచ్చి నాట్లు వేశాను. దిగుబడి 30 బస్తాలు వచ్చింది. ఎలాగోలా పెట్టుబడి మాత్రం దక్కింది. ఇలా అయితే సాగుచేయడం రైతులకు సాధ్యం కాదు.

– అచ్యుత పెద్దిరాజు, రైతు

రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలి

పెదవేగి : దేశవ్యాప్తంగా న్యాయవాదులంతా భారత రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలని ఆర్సియం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉద్బోధించారు. ఆదివారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలలో కథోలిక న్యాయవాదుల ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ న్యాయవాదులంతా నిబద్ధత కలిగి ఉండాలని శాంతి, న్యాయం కోసం అహర్నిశలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. న్యాయవాదులు రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకొని దేశవ్యాప్తంగా సదస్సులు సమావేశాలు ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింప చేయాలన్నారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా హాజరైన 130 మంది న్యాయవాదులు, సిస్టర్లు, జడ్జిలు సుపీరియర్లకు పీఆర్వో ఫాదర్ టి ఇమ్మానుయేల్ నిర్వహణ బృందం ఫాదర్లు ఫాదర్ జి మోజెస్, ఫాదర్ బాల, ఫాదర్ ఇన్జే పాల్, ఫాదర్ జాకబ్, ఫాదర్ బాబు జార్జి కృతజ్ఞతలు తెలిపారు.


న్యాయవాదుల సదస్సును ప్రత్యేక ప్రార్థనతో ముగించిన బిషప్ పొలిమేర జయరావు

బాల్య వివాహాలు అనాగరికం

ఉంగుటూరు: బాల్య వివాహాలు అనాగరికమైన విధానమని, వాటిని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కమిటీ సభ్యులు అల్లు శ్రీను అన్నారు. ఆదివారం ఉప్పాకపాడులో బాల్యవివాహాల వల్ల సమాజానికి, వ్యక్తిగత ఆరోగ్యానికి కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో అల్లు శ్రీను మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు చేయడంవల్ల మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. బాలబాలికలను చదివించడం తల్లిదండ్రుల బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు, మగపిల్లలకు 25 ఏళ్లు పూర్తయిన తరువాత వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికడతామని తల్లిదండ్రులు, బాలబాలికలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయులు నక్క సుధాకర్, ఏఎస్ఎం ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు సుబ్బలక్ష్మి, జాన్సీ, ఆశావర్కర్లు నిర్మలా, మణి పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

ఉత్సాహంగా బాలోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శాంతినగర్‌లోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ ప్రధాన క్యాంపస్‌లో శనివారం బాలోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఎంఆర్ హాస్పిటల్స్ ఛైర్మన్ మాద్రాజు, సుగర్ వ్యాధి నిపుణుడు కల్యాణ చక్రవర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఆక్స్‌ఫర్డ్ ఆంగ్ల పాఠశాలల ఛైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, స్కూల్ ఆర్ఐ టి.ఉమా రాణి, ప్రిన్సిపాళ్లు ఐవీ సుధాకర్, శారద, లత పలు అంశాలు వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

10 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉంగుటూరు: ఈనెల 10 నుంచి జనవరి 2 వరకు మండలం పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 10న బాదంపూడి, 11న కాకర్లమూడి, 12న వీఏపురం,16న చేబ్రోలు, 17న తల్లాపురం, 18న సీహెచ్ ఖండ్రిక, 19న ఉంగుటూరు, 20న కైకరం, 21ఎ.గోకవరం, 23న నల్లమాడు, 24న గోపినాథపట్నం, 26న వెల్లమిల్లి, 27న బొమ్మిడి, 28న కాగుపాడు, 30న దొంతవరం, 31 రావులపర్రు, 2న రాచూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు తెలిపారు. ఈ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎటువంటి ఫీజు చెల్లించకుండా 49 సర్వీసులు పొందవచ్చునని తహసీల్దారు ప్రసాదు వివరించారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు

భీమడోలు: మండలంలో ఈనెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి ఆదివారం కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని తెలిపారు. ఈనెల 10వ తేదీ మంగళవారం పూళ్ల, 12న గుండుగొలను, 16న అంబర్‌పేట, 18న భీమడోలు, 20న చెట్టున్నపాడు, మల్లవరం, 23న ఆగడాలలంక, 26న పోలసానిపల్లి, 28న సూరప్పగూడెం, 30న దుద్దేపూడి, కోడూరుపాడులో రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, రైతులు రెవెన్యూ పరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని ఆమె కోరారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు


తల్లి మరియ ప్రతిమకు విశేష అలంకరణ


భారీ స్టార్లు సిద్ధం


రాయన్నపాలెంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

పెదవేగి : మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. భారీ క్రిస్మస్ స్టార్లను చర్చిలు, కూడళ్లలో ఏర్పాటు చేసి, నూతన శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. చర్చిల్లో, క్రైస్తవ సంస్థల్లో క్రీస్తు జన్మించిన పశువుల పాకల నమూనాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణను రంగు కాగితాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

దెందులూరు: నన్నయ్య యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు అన్నారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ద్వితీయ సంవత్సరం బీపీఈడీ విద్యార్థిని ఆర్.శ్రావణి, ద్వితీయ సంవత్సరం యూజీడీ విద్యార్థిని టి రోహిణికి షీల్డులు ప్రిన్సిపల్ అందజేసి అభినందించారు. నిరంతర సాధన ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా గుర్తింపు విజయం తప్పక లభిస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు. సమావేశంలో లెక్చరర్లు డాక్టర్ సొంగా దిలీప్ కుమార్, రత్నబాబు, సాయి, కళాశాల సిబ్బంది విజేతలను అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేలు

కొనసాగుతున్న వంతెన పనులు

- సిమెంట్ తూరల స్థానంలో భారీ ఐరన్ తూరలు ఏర్పాటు
- వంతెన నిర్మాణ ప్రాంతంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు


గుండుగొలను వద్ద ఇనుప పైపు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


వంతెన నిర్మాణ ప్రాంతంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గుండుగొలను వద్ద గోదావరి కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు ఆటంకాలు తొలగిపోయాయి. రైతులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మించాలన్న నిర్ణయంతో పనులకు సందిగ్ధం వీడింది. దీనితో పనులు యథావిధిగా సాగుతున్నాయి. పంట పొలాలకు సాగు నీరు లేక ఇబ్బందులు పడతామని, ఇప్పటికే కాలువలో నీటి ప్రవాహం తగ్గిందని దాళ్వా సీజన్ పూర్తయిన తర్వాత పనులు చేపట్టాలని దెందులూరు మండలంలోని శివారు ప్రాంతాల రైతులు వంతెన నిర్మాణ పనులకు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనితో పనులపై ప్రభావం పడింది. శివారు రైతులకు, గుండుగొలను, వివిధ గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారధి నిర్మాణ పనులు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సిమెంట్ తూరల స్థానంలో ఐరన్ తూరలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి పనులు ప్రారంభించారు.

కాంట్రాక్టర్, అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

రెండేళ్ల క్రితం గుండుగొలను వద్ద గోదావరి కాలువపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన కూలిపోయింది. అయితే పలు మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, రైతులు, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషి ఫలితంగా ప్రభుత్వ నిధులతో తక్షణమే బెయిలీ వంతెనను నిర్మించారు. దీనితో ఆగిపోకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను పుప్పాల వాసుబాబు తీసుకుని వెళ్లి వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. పనులకు నిధులు ఆటంకం లేదు. కాంట్రాక్టర్, జలవనరుల శాఖ అధికారుల మధ్య తొలి నుంచి సమన్వయం కొరవడింది. సాగునీటి ప్రవాహం సాకుతో రెండు సీజన్ల పాటు పనులు పూర్తిస్థాయిలో చేపట్టిన దాఖలాల్లేవు.

ప్రజల ఆందోళనతో దిగివచ్చిన అధికారులు

ఇటీవల గ్రామస్తుల ఆందోళనతో దిగివచ్చిన అధికారులు కాలువ ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా పోలవరం నుంచి 3 మీటర్ల గల భారీ తూరలను తీసుకుని వచ్చారు. ఇటీవల వంతెన పనులు పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆ తర్వాత ఈ ఐరన్ తూరలు వేస్తే కాలువలోని జారుడు మట్టి వల్ల తూరలు ఏర్పాటు చేస్తే గతి తప్పి నిర్మాణం కష్టంగా ఉంటుందని భావించిన సంబంధిత అధికారులు వాటి స్థానంలో సిమెంట్ తూరలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఈ విషయం తెలుసుకున్న దెందులూరు మండలంలోని సత్యనారాయణ, పాలగూడెం, కొవ్వలి, ఉండ్రాజవరంలోని రైతులు వంతెన నిర్మాణ పనుల వద్ద సిమెంట్ తూరల ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేసారు. ఇప్పటికే తాము నారుమడులు వేసుకున్నామని, దీనితో పొలాలకు సాగు నీరు చేరకుంటే తీవ్ర ఇబ్బందులు పడతామని జలవనరుల ఉన్నతాధికారులు తమ సమస్యను తెలియజేసి అభ్యంతరాన్ని వ్యక్తం చేసారు. దీనితో గుండుగొలనులోని ప్రజలు వారి అభ్యంతరాన్ని తిప్పి కొట్టే ప్రయత్నం చేసారు. అధికారులు, కాంట్రాక్టర్, ఇతర నాయకులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. దీనితో నిర్మాణ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం రాత్రి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్, నాయకులతో చర్చించి అందరికీ ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టేలా భారీగా ఉన్న ఐరన్ తూరలు పెట్టాలని వారిని ఆదేశించారు. దీనితో పనులు పనులు కొనసాగుతున్నాయి.

పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క

సార్వా సీజన్ పూర్తి కావడంతో సాగునీటి ప్రవాహాన్ని జలవనరుల శాఖ అధికారులు గణనీయంగా తగ్గించారు. వాస్తవంగా నీటి ప్రవాహానికి కాలువలోని తూడు, గుర్రపు డెక్క, కర్రనాచులు కొట్టుకుపోయేవి. ఒక్కసారిగా అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించడంతో కాలువలో దట్టంగా ఉన్న తూడు, గుర్రపుడెక్కలు అక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర నిలిచి ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. దీనితో వంతెన నిర్మాణంలో తూరలు ఏర్పాటుకు తీవ్ర ఆటంకంగా మారింది. దీనితో కాంట్రాక్టరు, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారులు స్పందించిన తూడు, గుర్రపుడెక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు రాట్నాలమ్మ హుండీ లెక్కింపు

పెదవేగి : రాట్నాలమ్మవారి దేవస్థానం తాలూకా హుండీలు సోమవారం లెక్కిస్తామని ఆలయ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ ముఖ మండపం వద్ద అమ్మవారి హుండీలు లెక్కిస్తామని ఈఓ తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలోని కొల్లేరు భూముల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. కోడి పందేలు ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,100 నగదు, ఒక కోడి, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.